క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు చేయండి

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండ లోని గ్రామశివారు రావికంపాడు రోడ్డు పక్క నుంచి పంటచేలకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి పెద్దిని వేణు డిమాండ్ చేశారు. అధ్వానంగా ఉన్న రోడ్డు దుస్థితిని రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుందని, పంటచేలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడ్తున్నారని తెలిపారు. గుంటలమయంగా ఉండే రోడ్డుపై వర్షపునీరు చేరికతో రాకపోకలు కష్టతరంగా మారుతాయన్నారు. అధికారులు, పంచాయతీ పాలకవర్గం సత్వరమే స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయి రాజా, రైతులు అంతటి వెంకటేశ్వర్లు, బడుగు రాము, పోగుల కృష్ణయ్య, గోదా వీరమోహన్‌రావు, దేవరపల్లి రామారావు పాల్గొన్నారు.

పోడుయాత్ర హాస్యాస్పదం



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్ రెడ్డి

పినపాక: ఇటీవల కొత్తగూడెంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాదయాత్ర చేయడం హాస్యాస్పదమని పినపాక మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అయిపోయిన పెళ్లికి డప్పు కొట్టినట్లు జూన్ 24 నుంచి పోడు పట్టాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఇప్పుడు పాదయాత్ర చేయడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం పట్టాల సిద్ధం చేసిందని, పోడు సాగుదారులకు రైతుబంధు, రైతు బీమా కూడా అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, నాయకులు వాసు బాబు, సోంపల్లి తిరుపతి, కటకం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానించకపోవడం రాజ్యాంగ విరుద్ధం

చర్ల: నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతిని ఆహ్వానించకుండా అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభించాల్సి ఉండగా, ఆర్‌ఎస్‌ఎస్ సూచనల మేరకు అందుకు భిన్నంగా వ్యవహరించి ఆదివాసీల ఆత్మ గౌరవాన్ని కించపరిచేలా ప్రధాని నరేంద్ర మోదీ వ్యవహరించారని ఆయన విమర్శించారు. తెర వెనుక మనువాద సిద్ధాంతాన్ని నడిపిస్తూ.. తెర ముందు ఆదివాసీలకు పెద్ద పీట వేస్తున్నామని, మహిళలను గౌరవిస్తున్నామని ప్రకటించుకోవడం బీజేపీకే చెల్లుతుందన్నారు. సమావేశంలో పలువురు సీనియర్ జీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

మణుగూరురూరల్: వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర కేబినేట్‌లో నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ.. పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఆర్‌ఏలు పాలాభిషేకం చేశారు. వీఆర్‌ఏల కల నేరవేర్చిన సీఎంకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రేగా కాంతారావును వీఆర్‌ఏలు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పినపాక నియోజకవర్గంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

జ్వర బాధితులకు పండ్లు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో జ్వరాలు వచ్చి బాధపడుతున్న వారికి యలమంచి సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో పండ్లు కొబ్బరి బొండాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం సీపీఎం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య మాట్లాడుతూ.. యలమంచి సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కరోనా వచ్చినప్పుడు నిత్యవసర సరుకులు పంపిణీ, వరదలు వచ్చినప్పుడు వేలాది మందికి భోజనాలు, అగ్ని ప్రమాద బాధితులకు చిరు సాయం వంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశి, స్థానిక ఎంపీటీసీ కొర్స చిలకమ్మ, సొసైటీ డైరెక్టర్ యలమంచి శ్రీనుబాబు, సీపీఎం దుమ్ముగూడెం శాఖ కార్యదర్శి బర్రి నర్సింగ్ రావు, గుడి చైర్మన్ చుక్క గణేష్ రెడ్డి, వార్డు మెంబర్ బైరెడ్డి సతీష్, త్రినాథరావు, వేణు, కర్రీ బుజ్జి, ఆర్‌అండ్‌బీ డాక్టర్ సాయి బాబు, ముసలి రాంబాబు, నూక రెడ్డి కనకరాజు పాల్గొన్నారు.

మంత్రిగారూ.. జర చూడండి

- గిరిజన గ్రామాలకు మూడు రోజులకోసారి 'భగీరథ' నీరు
- త్రీఫేజ్ విద్యుత్ సమస్యలో ఈ దుస్థితి
- అధ్వానంగా అశ్వాపురం–గొందిగూడెం రహదారి
- మంత్రి అజయ్ దృష్టి సారించాలని వేడుకోలు



కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్

అశ్వాపురం: గిరిజన గ్రామాలకు తాగునీటి సరఫరా చేసేందుకు త్రీ ఫేజ్ విద్యుత్ సమస్య అడ్డుతగిలింది. దీంతో 19 గిరిజన గ్రామాలకు మూడు రోజులకొకసారి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నారు. అశ్వాపురం నుంచి గొందిగూడెం మీదుగా మొండికుంట వరకు రహదారి అధ్వానంగా ఉండి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో.. నేడు తుమ్మలచెరువు, గొందిగూడెం గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్.. దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

మండలంలో మిషన్‌భగీరథ తాగునీరు సరఫరా చేసేందుకు కుర్వాపల్లి కొత్తూరు గుట్టపై పంప్‌హౌస్ ఉంది. ఈ పంప్‌హౌస్ నుండి తుమ్మలచెరువు, వెంకటాపురం, గొందిగూడెం, గొందిగూడెం కొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామ పంచాయతీల్లోని 19 గిరిజన గ్రామాలకు మిషన్‌భగీరథ నీటి సరఫరా అవుతోంది. గ్రామాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సమస్యతో నిరంతరం మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేసేందుకు ఇబ్బంది అవుతుంది. వ్యవసాయ మోటర్లకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అయినప్పుడు మాత్రమే పంప్‌హౌస్ మోటర్ల ద్వారా 19 గిరిజన గ్రామాలకు మిషన్‌భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ మోటార్లకు అందించే త్రీ ఫేజ్ విద్యుత్ ఒక్కో సారి అంతరాయం కలిగితే తాగునీటి సరఫరా బంద్ అవ్వాల్సిందే. త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా సమస్యతో 19 గ్రామాల గిరిజనులకు రెండు రోజులకొకసారి మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేస్తున్నారు. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ ప్రత్యేకంగా ఉంటే మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తీరుతాయి.

ప్రతిపాదనలకే పరిమితమైన నిధులు

కుర్వాపల్లి కొత్తూరు గ్రామంలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ ద్వారా 19 గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు సరఫరా చేసేందుకు కొత్తగా త్రీ ఫేజ్ విద్యుత్ లైన్‌కు అధికారులు రూ.30 లక్షల నిధులు అవసరమౌతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మొండికుంట సబ్‌స్టేషన్ నుంచి కుర్వాపల్లి కొత్తూరు పంప్‌హౌస్ వరకు త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ కోసం విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేయగా మిషన్ భగీరథ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపి తొమ్మిది నెలలు గడిచింది. ఇప్పటికీ నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. తొమ్మిది నెలలు కావడంతో అంచనాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే త్రీ ఫేజ్ విద్యుత్ సమస్య తీరితే 19 గిరిజన గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు ప్రతి రోజు సరఫరా అవుతుంది. నిధుల మంజూరుకు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవ చూపాలని 19 గిరిజన గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

పరిష్కారానికి నోచుకోని రహదారి సమస్య

మండల కేంద్రం నుంచి గొందిగూడెం, తుమ్మలచెరువు గ్రామాల మీదుగా మొండికుంట వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రహదారి గుంతలు గుంతలుగా ఉండి అస్తవ్యస్తంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణించాలంటే ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంతలతో దుమ్ము, ధూళితో పిల్లలు, వృద్ధులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చిన్న వర్షానికే రహదారి బురదమయమై ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారికి కనీసం మరమ్మతులు చేయాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. రహదారి నిర్మాణంపై మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే రేగా దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

వారం రోజులుగా నీరు బంద్..



వారం, పది రోజులకొకసారి కూడా మా ఊర్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. అధికారులను అడిగితే కరెంటు లేదు, పైపులైన్ లీకేజీ అంటున్నారు. రోజూ మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని అధికారులను కోరుతున్నాం. అశ్వాపురం వెళ్లాలంటే రహదారి అధ్వానంగా ఉండి ఇబ్బంది పడుతున్నాం. రహదారినీ నిర్మించాలి.

– మిడియం రమాదేవి, మనుబోతులగూడెం

మూడు రోజులకు ఒకసారి..



గ్రామంలో మూడు రోజులకొకసారి మిషన్ భగీరథ నీరు వస్తున్నాయి. ఏఈనీ, డీఈని అడిగితే త్రీ ఫేజ్ విద్యుత్ సమస్య ఉందని చెబుతున్నారు. ఒక్కో సారి వారం రోజులకు కూడా నీరు రావడం లేదు. పంచాయతీ మోటర్ల ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నాం. త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ మంజూరు చేయాలి. రహదారి నిర్మించాలి.

– పాయం భద్రమ్మ, గొందిగూడెం సర్పంచ్

రోలింగ్ క్యాన్లు అందజేత



ఆదివాసీలకు రోలింగ్ వాటర్ క్యాన్లను అందజేస్తున్న ఎంపీపీ గుమ్మడి గాంధీ


పినపాక: మండల పరిధిలోని వలస గిరిజన గ్రామాలు ఎర్రగుంట, టేకులగూడెం గ్రామాల్లో మంచినీటి సమస్యలు పరిష్కరించేందుకు ఆదివారం డీఆర్‌డీఏ, ఐటీడీఏ ఆధ్వర్యంలో మంచినీటి రోలింగ్ క్యాన్లను ఎంపీపీ గుమ్మడి గాంధీ ఆదివాసీలకు అందజేశారు.

అనంతరం మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి ఆదివాసీలు మంచినీళ్లు తీసుకువచ్చేందుకు ఇబ్బంది పడుతున్న క్రమంలో వారికి ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. బరువులు మోయకుండా రోలింగ్ ద్వారా మంచి నీటిని తెచ్చుకునేందుకు సులభంగా, ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ రామారావ్, సొసైటీ డైరెక్టర్ కొండేరు రాము తదితరులు పాల్గొన్నారు.

నాడు పుష్ప విలాసం.. నేడు హరితశోభితం



ఏడాది క్రితం ఇదే రోజుల్లో పసుపు వర్ణంలో పూసిన పూలు (ఫైల్)



ప్రస్తుతం పచ్చని ఆకులతో హరితశోభితంగా ఉన్న చెట్లు

అశ్వారావుపేటరూరల్: సరిగ్గా ఏడాది క్రితం ప్రధాన రహదారి వెంట ఉన్న చెట్లు పసుపు రంగు పూలతో ఆహ్లాదం కలిగించగా.. తాజాగా ఈ చెట్లు పచ్చిన ఆకులతో హరితమయంగా మారాయి. అశ్వారావుపేట మండలం కొర్సాగూడెం నుంచి సున్నంబట్టి వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాలు గతేడాది మే నెలలో (సరిగ్గా ఇదే రోజుల్లో) పసుపు పచ్చని వర్ణంలో చెట్లన్నీ నిండుగా పూలు పూశాయి. కాగా ప్రస్తుతం ఇవే చెట్లన్నీ నిండుగా ఆకు పచ్చని రంగులో హరితశోభితంగా మారి చూపరులను ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. దాంతో అటువైపు వెళ్లే వారిని ఈ చెట్లు ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' తన కెమెరాలో క్లిక్ మనిపించింది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



భద్రాచలంటౌన్: సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు



చండ్రుగొండ: ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా కలుసుకున్న పూర్వవిద్యార్థులు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కుటుంబసమేతంగా ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో ఆనందోత్సవాల నడుమ ఆత్మీయ సమ్మేళనం చేసుకున్నారు. 28 ఏళ్ల తరువాత కలుసుకున్న వారు కుటుంబ పరిస్థితులను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. మొత్తం 48 మంది విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటూ ఇక్కడ హాజరయ్యారు. నాటి ఉపాధ్యాయులు పాపారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణలకు ఘనంగా సన్మానించారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్‌ఫ్లవర్స్ స్కూల్‌లో 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం వెంకటేశ్వర విలాస్‌లో కలుసుకున్నారు.

పాఠశాలలో కలిసి చదువుకుని 25 సంవత్సరాలు గడిచిన సందర్భంగా ఏర్పాటు చేసుకున్న ఈ కార్యక్రమంలో అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో నాడు పాఠాలు బోధించి పలువురు ఉపాధ్యాయులు, 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా క్యాంటిన్ వ్యవస్థ

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని ఓసీ–2 క్యాంటిన్ వ్యవస్థ అధ్వానంగా మారిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.వెంకటరత్నం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఓసీ–2 క్యాంటిన్‌లో నాణ్యత పాటించడం లేదని, విధి విధానాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యం సైతం క్యాంటిన్ తీరుపై నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

అన్నపురెడ్డిపల్లి: సహకార సొసైటీ పరిధిలోని రైతులకు పంపిణీ చేయడానికి పచ్చి రొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఈ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. గుంపెన సొసైటీలో 10 క్వింటాళ్ల పిల్లి పెసలు, 500 క్వింటాళ్ల జీలుగులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఐరన్ రాడ్లు చోరీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణం నిర్వహించే మిథిలా స్టేడియం వద్ద ఆదివారం ఇనుప రాడ్లు చోరీకి గురైనట్లు సమాచారం. ఈ విషయాన్ని భక్తులు దేవస్థానం అధికారులకు తెలియజేయగా, ఆలయ సిబ్బంది చోరీకి పాల్పడిన మహిళను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి సోమవారం విచారణ చేసి చర్యలు తీసుకుంటారని సమాచారం.

సమస్యల పరిష్కారానికే ప్రజాగర్జన

దుమ్ముగూడెం: జూన్ 4న కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజాగర్జన సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తూరుబాక, సర్వాపురం, రామారావుపేట, సీతారాంపురం గ్రామ శాఖ సమావేశాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశాల్లో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కుంజా శ్రీనివాసరావు, బల్ల సాయికుమార్, నోముల రామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుమ్మడి రమణ, సురేష్, తాటిపూడి రమేష్ పాల్గొన్నారు.

మొద్దులమాడలో వైద్య శిబిరం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మొద్దులమాడ గ్రామంలో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో 63 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 10 మంది జ్వర బాధితులుగా తేలడంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సత్యనారాయణ, విజయ్‌రెడ్డి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరు క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గిరిజనులకు పోడు పట్టాలను పంపిణీ చేసేందుకు ఇప్పటికే సర్వే ప్రక్రియ పూర్తయినట్లు, జూన్ 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పోడుపట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కార్యాలయంలో పోడుసాగుదారులకు పట్టాపాస్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు సీఎం కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో ఆయన మరో సారి విజయం సాధించి హ్యాట్రిక్ సీఎం కానున్నారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యం బాబు, పట్టణ కార్యదర్శి బొలిశెట్టి నవీన్, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, రైతు సంఘం కోఆర్డినేటర్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో బీటీపీఎస్ రైల్వేలైన్ నిర్వాసితుల కోసం మంజూరు చేసిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సర్పంచ్ కొమరం జంపేశ్వరి, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యం బాబు, అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌తో తెలుగువారి ఆత్మగౌరవం..

తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహానుభావుడు దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మణుగూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లో కమ్మమహాజన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే రేగా కాంతారావు, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, సీఐ ముత్యం రమేష్‌లు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం నాయకులు, ఎన్టీ రామారావు అభిమానులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్టీ'లో కలపడం తగదు..




జెడ్పీటీసీ సీతమ్మకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

దుమ్ముగూడెం: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో కలపడాన్ని మానుకోవాలని ఏఎస్పీ జిల్లా అధ్యక్షుడు వాగేబోయిన చంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జూన్ 11వ తేదీన నిర్వహించే చలో భద్రాచలం జై ఆదివాసీ భారీ బహిరంగ సభకు హాజరుకావాలని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మకు ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలకు మేలు చేయడానికి చేతులు రాని పాలకులు అంతటితో ఆగరండా మళ్లీ వెనకబడి ఉన్నారని వంకతో ఆదివాసీల రిజర్వేషన్లు గిరిజనేతర కులాలలకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని, అందులో భాగంగా వారిని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సున్నం ప్రశాంత్, ముర్రం మధు, కుంజ నగేష్ పాల్గొన్నారు.

కనిపించని చలివేంద్రాలు..

- ఏర్పాటు చేయని మేజర్ పంచాయతీ
- దాతలూ వెనుకడుగు..
- తప్పని బాటసారుల దాహార్తి కష్టాలు



ఒక్క చలివేంద్రం కూడా లేని అశ్వారావుపేట మేజర్ పంచాయతీ వ్యూ..

అశ్వారావుపేటరూరల్: గత కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండగా, ప్రభుత్వం, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన చలి వేంద్రాలు ఈ ఏడాది కనిపించడం లేదు. దాంతో బాటసారులు, పాదచారులు గుక్కెడు నీళ్ల కోసం దుకాణాలు, హోటళ్లపై ఆధారపడుతుండగా, మరికొంతమంది పాన్ దుకాణాల్లో మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి గొంతు తడుపుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. వీరికోసం మండే ఎండల నేపథ్యంలో ప్రధాన సెంటర్లలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ అశ్వారావుపేట మేజర్ పంచాయతీ పరిధిలో ఒక్క చలి వేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. విచిత్రం ఏమిటంటే చిన్న పంచాయతీ అయిన నారంవారిగూడెంలో ఓ చలివేంద్రం ఏర్పాటు చేశారుగానీ మేజర్ పంచాయతీ అయిన అశ్వారావుపేటలో మాత్రం ఒక్కటైన కనపించడం లేదు.

దాతలు సైతం ముందుకు రాలే..

ప్రతి ఏడాది అశ్వారావుపేటలో వేసవి వచ్చిందంటే చాలు కొంతమంది దాతలు పోటీలు పడి చలి వేంద్రాలను ఏర్పాటు చేసే వారు. రద్దీ ప్రదేశాలు, పోలీస్ స్టేషన్, రింగ్ రోడ్ సెంటర్లు, భద్రాచలం రోడ్‌లో దాతలు వేసవి ఆరంభంలోనే మినరల్ వాటర్‌తో కొంతమంది చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తే, ఇంకొంతమంది దాతలు చల్లని మజ్జిగతో కేంద్రాలను నిర్వహించే వారు. కానీ ఈ ఏడాది ఇక్కడ 40 నుంచి 42 డిగ్రీల ఎండలు ఉన్నప్పటికీ దాతలు సైతం చలి వేంద్రాలను ఏర్పాటు చేయలేదు. కేవలం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మాత్రమే వారంలో ఒకటి, రెండు రోజులు మజ్జిగ పంపిణీ చేస్తోంది.

ఆదేశాలిచ్చాం: ఎంపీఓ

ఎండల నేపథ్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని తాము ఆదేశించినట్లు అశ్వారావుపేట ఎంపీఓ సీతారామరాజు తెలిపారు. ఒకటో, రెండో కేంద్రాలు పెట్టామని మేజర్ పంచాయతీ ఈవో హరికృష్ణ చెప్పారని, వీటి గురించి తనకు తెలియదని అన్నారు. కాగా దీనిపై ఈవో వివరణ కోసం 'సాక్షి' ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను ఆదివారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ చేసిన పలు సేవలను గుర్తు చేసుకున్నారు. కాగా, దమ్మపేట మండలంలోని నాయుడుపేటలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావులు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా, తుమ్మల



ములకలపల్లి: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి



దుమ్ముగూడెం: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు